క్లుప్తంగా

తుపాను నేపథ్యంలో హెల్ప్‌డెస్క్



రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

రాజమహేంద్రవరం సిటీ: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైల్వేశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో రాజమహేంద్రవరం స్టేషన్‌లో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం నుంచి భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ హెచ్చరించిన నేపథ్యంలో రాజమహేంద్రవరంలో శనివారం రాత్రి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. 24 గంటలు అందుబాటులో ఉండేలా 0883 2420541ను ప్రకటించారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్టు సీటీఐ చంద్రమౌళి తెలిపారు.

ఇన్వర్టర్ బ్యాటరీ వితరణ

కడియం: స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయురాలు జీవీవీ నాగమణి స్కూల్ ల్యాబ్‌కు రూ.10 వేలు విలువ చేసే ఇన్వర్టర్ బ్యాటరీని శనివారం వితరణ చేశారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం టి.సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోడల్ ఆఫీసర్ల నియామకం

కడియం: వికసిత్ భారత్ సంకల్పయాత్రకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సంచార వాహనం ద్వారా ప్రజలకు వివరించడం కోసం ఆదివారం నుంచి ఈ నెల ఆరోతేదీ వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనిని మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో వర్క్‌షాప్

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం, నైపుణ్య అభివృద్ధి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఫైనాన్సియల్ లిటరసీ ఫర్ సెక్యూర్డ్ ఫ్యూచర్ అనే అంశంపై శనివారం జాతీయ వర్క్‌షాప్ జరిగింది. దీనికి ఆర్జేడీ చప్పిడి కృష్ణ, నన్నయ వర్సిటీ వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.ఉదయ్ భాస్కర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పొదుపు కంపెనీలో ఏవిధంగా పెట్టుబడి పెట్టాలనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ ఏఏ అన్నపూర్ణ, వర్క్‌షాప్ కన్వీనర్ పీవీవీ సత్యనారాయణ, పీహెచ్‌ఎస్‌ఎన్ పవన్ పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన

ధవళేశ్వరం: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా శనివారం ధవళేశ్వరంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన ఆలయ పునఃప్రతిష్ఠ జరగనుంది. ఇందులో భాగంగా శనివారం మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వాసవీమాత ట్రస్ట్, వాసవీ గీతామహిళా సమాజం, పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మద్దాలకు సత్కారం



ముద్దాల అనును సత్కరిస్తున్న కాపు నాయకులు

ప్రకాశం నగర్: కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ముద్దాల అనును నగర కాపు సంఘం నాయకులు శనివారం సాయంత్రం ఆయన కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్దాల అను భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలకరించాలని ఆకాంక్షించారు. నగర కాపు సంఘం అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్, వక్కపాటి మురళీకృష్ణ, కొత్తపల్లి బాల సుబ్రహ్మణ్యం, చవ్వాకుల రంగనాథ్, ఇసుకపల్లి శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఒత్తిడితో యువకుడి ఆత్మహత్య



దార్ల తేజ

రాజమహేంద్రవరం రూరల్: తీసుకున్న అప్పును చెల్లించలేదని తిట్టడంతో మనసాపం చెందిన యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బొమ్మూరు వెంకటగిరి కొండకు చెందిన దార్ల తేజ (28) గ్రామంలోని వాటర్‌వర్క్స్‌లో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అన్నవరం ప్రాంతానికి చెందిన పడాల శివ వద్ద రూ.2.90 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఇటీవల దార్ల తేజను అప్పు చెల్లించాలని పడాల శివ ఒత్తిడి తెస్తున్నాడు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం తేజ ఇంటికి వచ్చి కేకలు వేశాడు. దీంతో మనస్తాపం చెందిన తేజ శ్యామలాసెంటర్‌కు వెళ్లి పురుగుమందు కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి ఏవీ అప్పారావు రోడ్డులోని ఒక బార్‌లో మద్యం తీసుకున్నాడు. మద్యంలో పురుగుమందు కలుపుకొని తాగేశాడు. అనంతరం డెల్టా హాస్పిటల్ ఎదురుగా లాలాచెరువు నుంచి బెస్ట్‌ప్రైస్ వెళ్లే వైపు బైపాస్ రోడ్డులో కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తేజ తల్లి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జుబేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దార్ల తేజకు భార్య, రెండు నెలల బాబు ఉన్నారు.

శతాధిక నృత్యాభినయ సౌరభం

- 14 గంటల నిర్విరామ నృత్య ప్రదర్శన
- ఆకట్టుకున్న 125 మంది కళాకారుల నాట్యం



నృత్యాభినయం చేస్తున్న నాట్య కళాకారులు

సీటీఆర్ఐ: మయూరాలన్నీ ఒకచోటకు చేరి నాట్యం చేశాయా అన్నట్లు కనులవిందుగా నృత్యాభినయం సాగింది. ప్రకృతి కూడా చల్లటి గాలలతో స్వాగతం పలికింది. నెమలికి నేర్పిన నడకలివి...అంటూ కళాకారులు నృత్యాభినయం చేశారు. 40 ఏళ్లుగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది దేశ, విదేశాలలో అనేక నృత్య ప్రదర్శనాల ద్వారా మన దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చన నర్తన రుషి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శతాధిక నృత్యాభినయ సౌరభం శనివారం స్థానిక సంహిత కళాశాలలో వైభవంగా జరిగింది.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం..

నటరాజ నృత్యనికేతన్‌ను స్థాపించి 40 ఏళ్ల పూర్తయిన సందర్భంగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కోసం 126 మంది కళాకారులు 14 గంటల పాటు ఒక బృందం తరువాత మరో బృందం నిర్విరామంగా నాట్యం చేశాయి. ఉదయం 7.30 గంటలకు మొదలు పెట్టిన ఈ నృత్యయజ్ఞం రాత్రి 7.30 గంటలకు ముగిసింది. అలుపెరగని ఈ నృత్యోత్సవంలో కళాకారులు ఆలయ నృత్యాన్ని ప్రదర్శించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు ఆసాంతం ప్రదర్శనను తిలకించారు. రికార్డ్స్‌కి సంబంధించి వివరాలను ఆదివారం ప్రకటించనున్నారు.

20 వరకూ ప్రదర్శనలు



నేను ఒకటో తరగతి నుంచీ నాట్య గురువు దుర్గాప్రసాద్ వద్ద ఆలయ నృత్యం నేర్చుకుంటున్నాను. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్నాను. ఇప్పటి వరకూ 20 వరకూ నృత్య ప్రదర్శనలు చేశాను. 2022లో హరిద్వార్‌లో జరిగిన నృత్య పోటీలలో నాకు నేషనల్ అవార్డు వచ్చింది.

– ఆరుషి దుర్గాంబిక

ఎంబీఏ చదువుతున్నాను



నేను ఎంబీఏ చదువుతున్నాను. మూడో తరగతి నుంచి గురువు వద్ద నృత్యం నేర్చుకున్నాను. ఇప్పటి వరకూ 30 వరకూ నృత్య ప్రదర్శనలు ఇచ్చాను. గ్రూప్ ఫెర్ఫామెన్స్‌లో నాకు నేషనల్ అవార్డు వచ్చింది.

– ఎస్.దివ్యశ్రీ

నేషనల్ అవార్డు పొందాను



రెండో తరగతి నుంచీ నాట్యం నేర్చుకుంటున్నాను. నా తల్లిదండ్రులు నన్ను మంచి నాట్యకళాకారిణిగా చూడాలనుకుంటున్నాను. ఇప్పుడు నేను 9వ తరగతి చదువుతున్నాను. 15 వరకూ నృత్య ప్రదర్శనలు చేశాను. నేషనల్ అవార్డు పొందాను.

– భావన

దేశ, విదేశాల్లో ఖ్యాతి



ఆలయ నృత్యం అతి పురాతన, ప్రాచీన నృత్యం. దీని నుంచే భరత నాట్యం, కూచిపూడి వచ్చాయి. అంతరించి పోతున్న ఆలయ నృత్యాన్ని దేశ ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ఈ నాట్యాన్ని 40 ఏళ్లుగా శిష్యులకు నేర్పుతున్నాను. అనేక వేల మంది శిష్యులు ఈ నాట్యాన్ని నేర్చుకుని దేశ, విదేశాలలో కూడా ఆలయ నృత్యాన్ని నేర్పిస్తున్నారు. శిష్యులలో స్ఫూర్తిని నింపడానికి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం ఈ నృత్యాన్ని ఏర్పాటు చేశాను.

– సప్పా దుర్గా ప్రసాద్, నాట్యాచార్యుడు

కేంద్ర కారాగారంలో వసతుల పరిశీలన



కేంద్ర కారాగారాన్ని సందర్శిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారాన్ని శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సందర్శించారు. కారాగారంలోని ఆసుపత్రిని, అక్కడ ఉన్న వైద్య సదుపాయాలను, వంటశాలను, ఆహార ప్రమాణాలను పరిశీలించారు. ఖైదీలకు ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని సందర్శించారు. వెల్డింగ్, ఇతర నైపుణ్యాలలో శిక్షణ పొందుతున్న ఖైదీలతో మాట్లాడారు. వారు విడుదలైన తరువాత జీవనోపాధి కోసం ఈ శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నియమించిన పారా లీగల్ వలంటీర్లతో మాట్లాడారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి తెలియజేయాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. కారాగార వైద్య సిబ్బందితో మాట్లాడి ఖైదీల ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో కలిసి భోజనం చేశారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అబ్రహం

కంబాలచెరువు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎస్.అబ్రహం అన్నారు. జిల్లాలోని 19 మండలాల ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. నాడు – నేడు, టోఫెల్ పరీక్ష, మధ్యాహ్న భోజన పథకం, జేవీకే కిట్స్ అంశాలపై చర్చించారు. అన్ని పాఠశాలలకు సబ్జెక్టులకు టీచర్లను నియమించామని, సంబంధిత సబ్జెక్టు టీచర్ మాత్రమే ఆ సబ్జెక్టును బోధించాలన్నారు. ఇటీవల తాను సందర్శించిన పాఠశాలల్లో సంబంధం లేని సబ్జెక్టు టీచర్ బోధన చేస్తున్నారని, ప్రధానోపాధ్యాయులు అటువంటి లోపాలను గుర్తించి వెంటనే అర్హత ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయుడితోనే బోధన జరిపించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడి వద్ద విధిగా కాల నిర్ణయ పట్టిక ఉండాలన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు ముఖఆధారిత హాజరు నమోదు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. స్మార్ట్ టీవీ, ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానెల్ ఉన్నచోట కొందరు టోఫెల్ పరీక్ష నిర్వహించడం లేదని తమ దృష్టికి వచ్చిందని, సోమవారం నాటికి అందరూ టోఫెల్ పరీక్ష విధిగా నిర్వహించాలని ఆదేశించారు. ఇంటర్నెట్ సదుపాయం లేనిచోట్ల ప్రధానోపాధ్యాయుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ నెలలో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన ఉంటుందని, ముందుగా పాఠశాలలో నిర్వహించుకుని తదుపరి వారిని మండల స్థాయికి పంపించాలన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి జిల్లా స్థాయిలో పోటీకి అర్హత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ పాల్గొన్నారు.

4,200 క్యూసెక్కుల నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం డెల్టా కాలువలకు 4,200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 2 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.35 అడుగులుగా ఉంది.

తరల్‌తో అభ్యసనా సామర్థ్యాల మెరుగు

కంబాలచెరువు: ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు టీచింగ్ ఎట్ రైట్ లెవెల్(తరల్) కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తరల్ జిల్లా కో ఆర్డినేటర్ గెల్లా సురేష్ నాని అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరల్ అమలు తీరును ఆయన శనివారం పరిశీలించారు. పాఠశాల రికార్డులను, ఆన్‌లైన్ రికార్డులను సరిపోల్చి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు తమ తరగతి విద్యార్థుల సామర్థ్యాల స్థాయిలను తప్పనిసరిగా రికార్డు చేయాలని, గ్రేడింగ్‌లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కడియం ప్రాంత అభివృద్ధికి సహకారం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- వేమగిరిలో స్వర్గధామం భవనం ప్రారంభం



స్వర్గధామం భవనాన్ని ప్రారంభించిన వైఎస్సా ర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

కడియం: తన తండ్రితో పాటు, తన కుటుంబానికి కడియం మండలంతో ఉన్న అనుబంధం దృష్ట్యా ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు తోడ్పాటును అందిస్తానని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కాపు సంఘం విరాళాలతో వేమగిరి పంచాయతీ ఎదురుగా ఉన్న కాలువరేవులో స్వర్గధామం పేరిట భవనాన్ని నిర్మించారు. పితృకర్మలు నిర్వహించుకునేందుకు అనువుగా ఏర్పాటు చేసిన ఈ భవనాన్ని జక్కంపూడి రాజా రిబ్బన్‌కట్ చేసి శనివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజా మాట్లాడుతూ నియోజకవర్గాలు వేరైనా, ఈ ప్రాంతం వాసులు తమ కుటుంబంపై చూపే ప్రేమాభిమానాలకు తామెప్పుడు కట్టుబడి ఉంటామన్నారు. కడియం మండలం అభివృద్ధిలో తన తండ్రి, దివంగత జక్కంపూడి రామ్మోహనరావు చూపిన బాటలో తాము నడుస్తామన్నారు. ప్రజా విరాళాలతో అతి పెద్ద భవనాన్ని ఏర్పాటు చేసిన కాపు సంఘం పెద్దలను అభినందించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రముఖులకు వేదపండితులు కొత్తూరి సతీష్ స్వాగతం పలికారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, స్థానిక ప్రముఖులు రంకిరెడ్డి సుబ్బరాజు, కోలా వెంకటరాజు, పట్టపగలు వెంకట్రావు, వెలుగుబంటి వెంకటాచలం, పుల్లెపు ఆదినారాయణ, కొత్తూరి ముత్యాలరావు, వెలుగుబంటి అచ్యుతరాం, సూరపురెడ్డి జానకి రామయ్య పాల్గొన్నారు.

మహిళల క్షేమం కోరుతూ అభిషేకాలు



మాట్లాడుతున్న ఫౌండేషన్ చైర్‌పర్సన్ పద్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ది ఇండియా మహిళా ఫౌండేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అన్ని పుణ్యక్షేత్రాల్లోనూ మహిళల క్షేమాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ చెర్‌పర్సన్ జీవీఎల్ పద్మ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా నగరానికి విచ్చేసిన ఆమెను శనివారం స్థానిక కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లోని ఓ హోటల్లో బొమ్మూరుకు చెందిన పి.ఉమా విజయలక్ష్మి, ఎం.నాగేశ్వరరావు, పి.రమ్యస్మృతి కలిశారు. ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వచ్చిన వారిలో ఉమా విజయలక్ష్మి, నాగేశ్వరరావును సభ్యులుగా నియమించారు. పద్మ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఎటువంటి సమస్యనైనా తమ ఫౌండేషన్ దృష్టికి తీసుకువస్తే, దానికి పోలీసులకు తెలిపి, తాము కూడా పరిష్కారానికి చర్యలు చేపడతామని వెల్లడించారు.

అలరించిన సంగీత సభ



గానం చేస్తున్న గోపీ కిషోర్

రాజమహేంద్రవరం సిటీ: సద్గురు సన్నిధి శాస్త్రీయ సంగీత నృత్యసభ ఏకాదశ వార్షికోత్సవాల సందర్భంగా ప్రఖ్యాత గాయకుడు, కెనరా బ్యాంక్ ఉద్యోగి దేవులపల్లి గోపీ కిషోర్ గానం చేసిన శివపదం సంకీర్తన శ్రోతలను విశేషంగా అలరించింది. స్థానిక త్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. కీబోర్డ్ కుదుపూడి రాంబాబు, తబలా పానుగంటి శ్రీనివాస్, పేడ్స్ కె.ప్రసాద్ వాద్య సహకారం అందించారు.

మనోధైర్యంతోనే ఎయిడ్స్‌పై విజయం

- మాజీ ఎమ్మెల్యే సూర్యప్రకాశరావు
- బాధితులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న రౌతు సూర్యప్రకాశరావు

సీటీఆర్ఐ: మనోధైర్యంతోనే ఎయిడ్స్‌ను జయించగలమని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా కోనసీమ సేవా మండలి వ్యవస్థాపకుడు నేల కృపారావు ఆధ్వర్యంలో శనివారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ బాధితులపై వివక్ష చూపకుండా, వారికి పూర్తిస్థాయి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కోనసీమ సేవామండలి ఫౌండర్ నేల కృపారావు మాట్లాడుతూ తమ సంస్థలో 12 వేల మంది హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగులు నమోదయ్యారని, ఏటా ఎయిడ్స్ దినోత్సవం రోజు వారికి న్యూట్రిషన్ ఫుడ్, మందులు, పండ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 400 మంది బాధితులకు 18 రకాల న్యూట్రిషన్ ఫుడ్, పండ్లు పంపిణీ చేశామన్నారు. ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ ఆర్.శిల్పా నాయుడు మాట్లాడుతూ హెచ్‌ఐవీ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, న్యూట్రిషన్ ఫుడ్ స్వీకరించడం ద్వారా ఎక్కువ కాలం జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు మురళి, మెహర్, మధు, రవి, రామిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో ఫ్రెషర్స్‌డే



మాట్లాడుతున్న శ్యామ్‌రాజ్ నాయక్, చిత్రంలో శేషుమాధవ్

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ రంగం మిగిలిన వాటికన్నా ఎంతో గొప్పదని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో కొత్త విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ సీనియర్ విద్యార్థులు శనివారం ఫ్రెషర్స్ పార్టీ 23 పేరిట కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవన్ శ్యామ్‌రాజ్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సీపీఐ జన చైతన్యయాత్ర

ప్రకాశం నగర్: సీపీఐ జన చైతన్యయాత్ర శనివారంతో ముగిసిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. స్థానిక 34 వార్డులో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ యాత్రలో 9,500 కుటుంబాలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నామన్నారు. యాత్రకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, ఏఐఎస్‌ఎఫ్ నగర కన్వీనర్ స్టాలిన్ పాల్గొన్నారు.

సిమెంటు బెంచీల బహూకరణ



సిమెంట్ బెంచీలు అందజేసిన గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు సొంత నిధులతో బెంచీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని హౌసింగ్ బోర్డ్ మాజీ సర్పంచ్ మెట్ల ఏసుపాదం అన్నారు. కాలనీలోని సచివాలయం 1, 2, విజయేశ్వర కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీ, లాలాచెరువు ప్రాంతాలలో రూ.54 వేల విలువైన 16 సిమెంట్ బెంచీలను రాంబాబు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీవిత బీమా ఉద్యోగుల సంఘం కార్యదర్శి గన్నయ్య మాట్లాడుతూ నగరంలో జరిగే అనేక సేవా కార్యక్రమాలకు స్వర్ణాంధ్ర రాంబాబు తన వంతు సహకారం అందిస్తున్నారన్నారు. రాంబాబు మాట్లాడుతూ హౌసింగ్ బోర్డ్ కాలనీ, లాలాచెరువు ప్రాంతాల్లో ఇప్పటి వరకూ సుమారు వందకు పైబడి బెంచీలను ప్రజల అవసరార్థం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్ అమర్నాథ్, శ్రీనివాస్ కిషోర్, స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం



పాలకవర్గాన్ని అభినందిస్తున్న సతీష్‌చంద్ర స్టాలిన్

కడియం: జేగురుపాడు ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈనెల 5వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో శనివారం నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీగా ప్రకటించారు. శనివారం సొసైటీ పాలకవర్గం అధ్యక్షుడిగా సాకా కిరణ్ కుమార్, సభ్యులుగా మారే శ్రీనివాసరావు, మద్దుకూరి సుబ్బారావు, రాయి మోహనరావు, నల్లి చిన్నసూర్యారావు, తాలాబత్తుల వెంకటరత్నం, ముంగమూరి జీవరత్నం, మగ్గం వెంకన్న, బళ్ల చిన్న (వీర్రాజు) మాత్రమే నామినేషన్లు వేశారు. అనంతరం ఎన్నికల అధికారి, మండల ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గోపాలరావు ఆధ్వర్యంలో స్క్రూటినీ పూర్తయ్యింది. పోటీదారులు ఎవ్వరూ నామినేషన్లు వేయకపోవడంతో సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు అధికారులు ప్రకటించారు. కాగా.. నామినేషన్లు దాఖలు చేసిన వారంతా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ బలపర్చిన వారే కావడం గమనార్హం. అధికారిక ప్రకటన అనంతరం నూతన పాలకవర్గాన్ని సతీష్ చంద్ర స్టాలిన్ పూలమాలలతో అభినందించారు. ఎన్నికల అధికారులుగా మత్స్యకార సహాయ ఇన్‌స్పెక్టర్ వి.దేవానందం, కడియం ఎఫ్‌డీవో గోపాలరావు తదితరులు వ్యవహరించారు.

నైపుణ్యాల పోటీకి దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్ఐ: జాతీయ నైపుణ్యాభివృద్ధి సహకారంతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ భారతదేశ నైపుణ్యాల పోటీ 2023ను నిర్వహిస్తోందని, దీనికి ఈనెల 20వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ జిల్లాలో 810 మంది పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. టూరిజం – హాస్పిటాలిటీ, హోటల్ రిసెప్షన్, మీడియా, వినోదం, కళ, పరిశ్రమ 4.0 వర్సన్, పెయింట్స్ – కోటింగ్, అలంకరణ కేటగిరీల్లో నూతన ఆవిష్కరణల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ తరహా సుమారు 40 విభిన్న అంశాల్లో వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఇది చక్కటి వేదిక అన్నారు. జిల్లాకు చెందిన ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. వివరాలకు 99888 53335 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి



తొర్రేడులో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎన్నికల ఓటరు నమోదు అధికారి సరళ వందనం

రాజమహేంద్రవరం రూరల్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని రాజమండ్రి రూరల్ నియోజకవర్గ ఎన్నికల ఓటరు నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.సరళ వందనం విజ్ఞప్తి చేశారు. తొర్రేడు, వెంకటనగరం, కోలమూరు పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను శనివారం సందర్శించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. సరళ వందనం మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్ కింద శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు, ఈనెల 9వ తేదీ వరకూ మార్పులు, చేర్పులు, తొలగింపులు, కొత్త ఓటరు నమోదు కార్యక్రమం నియోజకవర్గపరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సాగర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

జిల్లాలో 92.53 శాతం పింఛన్ల పంపిణీ



రాజమహేంద్రవరంలోని ఓ ఆస్పత్రిలో కృపావతికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ దివ్యకుమారి



హుకుంపేటలో ముత్తే శ్రీనివాస్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్ విజయదుర్గ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా రెండోరోజు శనివారం జిల్లాలో 92.53 శాతం మందికి పింఛన్లు అందజేసినట్టు డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీణాదేవి తెలిపారు. జిల్లాలో 2,42,408 మంది లబ్ధిదారులకు రూ.66.90 కోట్లకు గాను, 2,24,301మందికి రూ.61.90 కోట్లు అందజేశామన్నారు. ఈనెల ఐదో వరకూ పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు.